కలెక్టర్‌ను కలిసిన ప్రెస్ అకాడమీ సెక్రటరీ

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎం.భాలగంగాధర్ తిలక్ బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ శర్మ ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి ప్రెస్ అకాడమి కార్యదర్శిని శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి చిత్ర పటాన్ని బహూ కరించారు. ప్రెస్ అకాడమి కార్యదర్శితో పాటు ఎస్.రశూల్, పి.దివాకర్ రెడ్డి, ఎస్. సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను సత్కరిస్తున్న ప్రెస్ అకాడమి సెక్రటరీ

సిబ్బందికి అదనపు భద్రత

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి పాడేరు :సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అదనపు భద్రత కల్పిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో పాడేరు నియోజకవర్గ సెక్టోరియల్ అధికారులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో లోటుపాట్లపై ఆరా తీసారు. సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు, సౌకర్యాలపై ఆరా తీసిన కలెక్టర్ మాట్లాడుతూ, సిగ్నల్ లేని ప్రాంతాలకు సెక్టోరియల్ అధికారులకు సహాయకులుగా సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. సిగ్నల్ ఉన్న ప్రాంతం నుండి ఎన్నికల నియామావళి ప్రకారం ఓటింగ్‌కు ముందు మాక్ పోలింగ్, పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే జిల్లా ఎన్నికల అధికారికి, సంబంధిత సెక్టోరియల్ అధికారులకు అందించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు బరువుగా భావించవద్దని, సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ హితబోధ చేసారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, రవాణా సదుపాయాలు, అందుబాటులో ఉన్న సమాచార వ్యవస్థలపై సెక్టార్ అధికారులకు అవగాహన ఉండాలని అన్నారు. ఎన్నికల సిబ్బందిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తాగు నీటి సదుపాయం లేని పోలింగ్ కేంద్రాలకు కేన్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలకు ర్యాంపులు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపడతామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని మధ్యలో ఎక్కడా వాహనాలు ఆగకూడదని చెప్పారు. ఈ సమావేశానికి హాజరు కాని సెక్టార్ అధికారులకు నోటీసులు జారీ చేయాలని డిఆర్‌ఓ ను ఆదేశించారు. ఈ సమావేశంలో సముక్త కలెక్టర్ భావన, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డిఆర్‌ఓ వి.వి.రమణ, ఎస్.డి.సి.పి. అంబేద్కర్, పాడేరు నియోజక వర్గం ఆరు మండలాల సెక్టర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు!

● సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

సిబ్బందికి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్.

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: రానున్న ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధినిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ సూచించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ, పోలింగ్ బూత్‌లు వద్ద ర్యాంపులు, మరుగుదొడ్లు, విద్యుత్తు, తాగునీరు వంటి సదుపాయాలు కచ్చితంగా ఉండాలని, మౌలిక వసతులు సక్రమంగా లేని పోలింగ్ కేంద్రాల వివరాలు ఫోటోలతో బాటు తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు ఆదేశించారు, ఓటర్ల జాబితా, అధికారులు పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ, తదితర వివరాలను సిబ్బంది నుండి అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,రానున్న ఎన్నికలు నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు, రంపచోడవరం నియోజకవర్గంలో సుమారు 2 లక్షల 74 వేల ఓటర్లు ఉండగా, 59 సెక్టార్లు, , 39 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని రూట్ మ్యాప్ తయారు చేశామన్నారు. రహదారి సక్రమంగా లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి రవాణా,రోడ్డు సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలు మండలాల్లో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించామన్నారు. ఆయా కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పనపై సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో రాజవొమ్మంగి తాహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, డిప్యూటీ తాహశీల్దార్ ఎ సత్యనారాయణ, ఎంపిడిఒ రంగారావు, ఎపిఎం ఆదినారాయణ, విఆర్‌ఒలు , పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పిహెచ్‌సిల్లో కార్డులను తనిఖీ చేపట్టారు, పిహెచ్‌సిలో మందులు నిల్వలు, వార్డులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు పర్యవేక్షించారు, పిహెచ్‌సిలో వసతులు, రోజువారి ఓపి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరకు అసెంబ్లీ రేసులో మత్స్యలింగం

-వైసీపీ సమన్వయకర్తగా నియామకం

ప్రజాశక్తి-పాడేరు: అరకులోయ ఎస్టి రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రేగం మత్స్య లింగం రేసులో నిలిచారు. ఆయనను అరకు అసెంబ్లీ వైసిపి సమన్వయకర్తగా నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఆయన అరకులోయ నియోజక వర్గంలోని హుకుంపేట మండలం జడ్పిటిసి సభ్యులుగా ఉన్నారు. 2018లో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఆయన క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో అరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శెట్టి ఫాల్గుణ గెలుపునకు కీలక పాత్ర పోషించి విజయానికి కృషి చేశారు. తదనంతరం వచ్చిన ఎన్నికల్లో అరకులోయ జడ్పిటిసిగా బరిలో దిగి గెలుపొందారు. అరకులోయ నియోజకవర్గ పరిధిలో హుకుంపేట మండలం కొంతేలి ఆయన స్వగ్రామం. కొండదొర సామాజిక వర్గానికి చెందిన ఆయన 25 ఏళ్లకు పైగా ఈ ప్రాంతంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పని చేసి అటు ఉపాధ్యాయ వర్గాల్లోనూ గిరిజన ఉద్యోగులు వివిధ వర్గాల గిరిజన ప్రజల్లో ఆయన గుర్తింపు పొందారు. రాజకీయాల పట్ల ఆసక్తితో ఆయన గత పదేళ్లుగా నియోజకవర్గంలోని వివిధ ప్రజా సంఘాలతో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ఆయనతో పాటు గతంలో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సివేరి దొన్ను దొర గతసారి వైసీపీ రెబెల్ గాను ఆసారి టిడిపిలో చేరి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నద్ధమైన సంగతి విధితమే. కాగా నెల రోజుల క్రితం అరకు అసెంబ్లీ వైసిపి సమన్వయకర్తగా ఎంపీ గొడ్డేటి మాధవిని పార్టీ నియమించిన సంగతి తెలిసిందే. అయితే ఆమె నియామకం పట్ల పార్టీ శ్రేణుల్లో వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. స్థానికేతురాలని ఆమెను ఓడిస్తామంటూ పార్టీ నాయకులు మూకుమ్మడిగా అసమ్మతి వ్యక్తం చేస్తూ అధిష్టానానికి సంకేతాలు ఇచ్చారు. ఇలా ఉండగా ఇటీవల మాధవి ఆడబిడ్డ కు జన్మనిచ్చి మాతృమూర్తి అయ్యారు. ఈ తరుణంలో అరకు అసెంబ్లీ సమన్వయకర్తను మార్చడం వైసిపికి అనివార్యం అయ్యింది. ఈ నేపథ్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన రేగం మత్స్య లింగంను అధిష్టానం నియమించింది. అరకు నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన దొన్నుదొర, రేగం మత్స్య లింగం టిడిపి వైసిపి పార్టీలకు సమన్వయకర్తలుగా నియమితులు కావడం, ఇరు పార్టీలు సమవుజ్జీలను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేసినట్లు అయ్యింది. గత 2019 ఎన్నికల్లోను ఈ రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒకే సామాజిక వర్గానికి (వాల్మీకి) చెందినవారు. అదే విధంగా ఈసారి కూడా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఒకే సామాజిక వర్గం వారు. అయితే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోరు రసవత్తరంగా మారనుంది.

కాగా రేగం మత్స్యలింగం వైసీపీ సమన్వయకర్తగా నియమితులు కావడం పట్ల పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ కేటాయించిన అభ్యర్థి గెలుపునకు కృషి

ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి- పెదబయలు: వైస్సార్సీపీ అల్లూరి జిల్లా నూతన అధ్యక్షులు, అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ పదవి చేపట్టిన నాటి నుండి మొదటిసారిగా మండల కేంద్రానికి విచ్చేసారు. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు ఫాల్గుణ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలను శిరసా వహిస్తానని తెలిపారు. అరకు పార్టీ సమానవ్యయ కర్తగా ఎవరికీ కేటాయించినా క్రమశిక్షణతో పార్టీ అభ్యర్థి గెలుపునకు తన కేడర్‌తో పని చేసి తానేంటో నిరూపించుకుంటానన్నారు సమావేశాలు గ్రామ స్థాయినుండి మండల స్థాయి వరకు ఇప్పటికే కేడర్‌ను సంసిద్ధాం చేశానన్నారు. తనకు టికెట్ కేటాయించ లేదని అభిమానులు నిరాశ పడవద్దని, పార్టీని నమ్ముకొని ఉంటే భవిష్యత్తు ఉంటుందన్నారు. జగన్ మోహన్ రెడ్డి పార్టీని నమ్మిన వారికి మొండిచేయి చూపించరన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, మండల అధ్యక్షులు వి.ఆనందరావు, మాజీ జడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, సూరయ్య, మండల సర్పంచ్‌ల ఫోరమ్ మాజీ అధ్యక్షులు పాంగి సింహాచలం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

3న ఉపాధ్యాయుల ప్రమోషన్ల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జిటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులకు ఈనెల 3న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబుసలాం తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఐటిడిఎ సమావేశమందిరంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు జనవరి 20న సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు హాజరైన వారంతా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

మంచులో వెళ్తున్న వాహనం

మంచు ముసుగులో అరకులోయ

ప్రజాశక్తి-అరకులోయ :పర్యాటక కేంద్రమైన అరకులోయ కు మంచు ముసుగు కమ్ముకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్న విషయం తెలిసిందే. అలాగే ఇటీవల నుంచి చలి తీవ్రత కూడా తీవ్రంగా పెరగడంతో ఈ ప్రాంతంలో వాసులు గజగజ వణుకుతున్నారు. గతంలో నవంబర్,డిసెంబర్ నెలలో అధికంగా మంచుతో ఈ ప్రాంతం కప్పబడి ఉండేది అయితే ఈ ఏడాది దట్టమైన పొగ మంచు ఉదయం సాయంత్రం వేళలో కమ్ముకుంటుండడంతో ఇటూ పర్యాటకులు మంచును ఆస్వాదిస్తూ ఆనందంగా గడుపుతున్నప్పటికీ, ఈ ప్రాంతంలోని గిరిజనులు, వాహన చోదకులకు మాత్రం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. అరకు- విశాఖ ఘాట్ రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళలో ప్రయాణించాలంటేనే భయాందోళన చెందుతున్నారు. దట్టమైన పొగ మంచు కమ్ముకుంటుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తూ బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ప్రతి వాహనదారుడు కూడా మంచు వల్ల పగటివేళ్లలో కూడా వాహనాలకు లైట్లు వేసి ప్రయాణించడం ఈ సీజన్లో పరిపాటిగా మారింది. పొగమంచు, చలి అధికంగా ఉండడంతో అనేకమంది పర్యాటకులు పలు ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు.

రోడ్డుపై దట్టంగా కురుస్తున్న మంచు

జెసి భావన బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా భావన వశిష్ట్ బుధవారం భాధ్యతలు స్వీకరించారు. భావన జేసిగా జిల్లాకు రాకముందు గ్రామ, వార్డు సచివాలయ శాఖ అదనపు సంచాలకులుగా బాధ్యతలు చేపట్టారు. 2019 బ్యాచ్‌కు చెందిన భావన వశిష్ట్ సహాయ కలెక్టర్‌గా కృష్ణా జిల్లాలో శిక్షణ పొందిన అనంతరం పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా పని చేసారు. తదుపరి గ్రామ, వార్డు సచివాలయ శాఖకు బదిలీ పై వెళ్ళిన ఆమె ఇటీవల జరిగిన బదిలీలలో ప్రస్తుత జేసి కార్తిక్ స్థానంలో నూతన జేసిగా బదిలీపై వచ్చారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు

● చింతపల్లి, జిడిసి క్యాంపులో మూడునెలలుగా ఇదే పరిస్థితి

● కరెంట్ వృథా అవుతున్నా పట్టని యంత్రాంగం

● విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంపై గిరిజనం ఆగ్రహం

ప్రజాశక్తి -సీలేరు: విద్యుత్‌ను ఆదా చేయాలంటూ ఒకవైపున ప్రభుత్వం, అధికారులు ప్రజలు, వినియోగదారుల చెవిలో ఘోష పెట్టేలా చెబుతుంటే, సీలేరు మేజరు పంచాయతీలోని చింతపల్లి క్యాంప్, జిడిసి క్యాంపులో వీధిలైట్లు రేయింబవళ్లు తేడా లేకుండా వెలుగుతుండడంపై గిరిజనులు మండిపడుతున్నారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆదా చేయాల్సిన విద్యుత్ వృథా అవుతోందని అంటున్నారు. ఒకటి, రెండు రోజులు కాదు... గడచిన మూడు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా, ట్రాన్స్‌కో ఆపరేషన్స్ సిబ్బంది, విద్యుత్ లైన్‌మెన్ తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోర్ స్క్వేర్ కేబుల్ కాలిపోవడంతో దాన్ని స్థానంలో కొత్త కేబుల్ అమర్చవలసి ఉండగా, వెంటనే చేయాల్సిన పనిని, మూడు నెలలైనా చేయకపోవడాన్ని తప్పుపడుతున్నారు. లైట్లు వెలిగే విధంగా ఆన్ ఆఫ్ స్విచ్ బోర్డు ఏర్పాటు చేయకుండా, డైరెక్ట్ చేయడం వల్ల 29 బల్బులు రేయింబవళ్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని, విద్యుత్ సిబ్బంది నిర్వాకం వల్ల ఎంత విద్యుత్ వృథా అవుతుంతో వారే చెప్పాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వృథా అవుతున్న విద్యుత్తుకుక సంబంధిత అధికారులకు బాధ్యత వహించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని పగటిపూట వెలుగుతున్న వీధిదీపాలు నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జిడిసి క్యాంపులో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు

వరద బాధిత కుటుంబానికి చేయూత

● రూ.30 వేల నగదు, గృహనిర్మాణ సామగ్రి అందజేసిన డాక్టర్ జమాల్‌ఖాన్

బాధితురాలికి సాయం అందజేస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి- కూనవరం :వరదల దెబ్బకు ఇళ్లను కోల్పోయి, రెండేళ్లుగా నిరాశ్రయులై ఇబ్బందులు పడుతున్న చందుకర్ జయ అనే గిరిజన కుటుంబానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్, అండగా నిలిచారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి కష్టాలను స్వయంగా పరిశీలించిన డాక్టర్ జమాల్‌ఖాన్, బాధిత కుటుంబానికి రూ. 30వేల నగదుతోపాటు గృహనిర్మాణానికి అవసరమైన రూ. 35వేలు విలువ చేసే ఇనుప పైపులు, సిమెంట్ రేకులను అందజేశారు.

మండలంలో 2022లో సంభవించిన వరదలకు చందుకర్ జయ అనే వ్యక్తి ఇళ్లు కొట్టుకపోయింది. అప్పటినుంచి ప్రభుత్వం, దాతల నుంచి సహకారం అందకపోవడంతో ఇబ్బందులతో జీవనంసాగిస్తున్నాడు. దీనిపై విషయం తెలుసుకున్న డాక్టర్ జమాల్‌ఖాన్ అండగా నిలవడంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బాధిత కుటుంబానికి ఆశ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి సయ్యద్ సుభాని రూ.పదివేల నగదుతో పాటు బట్టలను కూడా అందజేశారు. ఎస్‌కే మీరా అనే కేన్సర్ బాధితునికి కూడా రూ. ఐదువేల నగదు సాయాన్ని జమాల్‌ఖాన్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జమాల్‌ఖాన్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని తమ వంతు బాధ్యతగా ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి ఆదుకోవాలని జమాల్‌ఖాన్ కోరారు. కార్యక్రమంలో కూనవరం ముస్లిం పెద్దలు సూఫీ, హఫీజ్, షఫీ ఉల్లా, సద్దాం హుస్సేన్. విఆర్ పురానికి చెందిన సర్ఫరాజ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఇఒకు ఘన సత్కారం

ఎంఇఒ సత్యనారాయణను సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రిపబ్లిక్‌డే సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఎంఇఒగా అవార్డు స్వీకరించిన కెవి సత్యనారాయణ దొరను బుధవారం యుటిఎఫ్ రంపచోడవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఆర్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షులు విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి విశ్వరాజు, రంపచోడవరం మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సనాతన బాబు, వెంగళరావు, సూరిబాబు, టాలిస్టె బాబు, అనిల్ బాబు, రాజు, లింగన్న , ఇతర ఉపాధ్యాయులంతా ఎంఇఒను సత్కరించి, అభినందనలు తెలిపారు.

మంచు, చలి తీవ్రతతో ఇక్కట్లు

సీలేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో మంచు అధికంగా కురవడంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. దీంతో వృద్ధులు చిన్నారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. గడచిన వారం రోజులతో పోల్చుకుంటే రెండు రోజుల నుంచి చలి తీవ్రత అధికం ఉంది. పగటిపూట ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో మహాశివరాత్రి వచ్చేవరకు వాతావరణంలో మార్పులు ఈ విధంగానే ఉంటాయని పలువురు అంటున్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుతోపాటు సీలేరు నది పరివాహక ప్రాంతంలో చలి తీవ్రత గణనీయంగా పెరగడం, రాత్రి వేళ ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో మన్యవాసులు చలిమంటలు వేసుకొనిఉపశమనం పొందుతున్నారు.

4లోగా స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని నిరుద్యోగ గిరిజన యువత ఆర్థిక తోడ్పాటుకు రంపచోడవరం డివిజన్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్స్ ద్వారా డ్రైవింగ్, బ్యూటీషియన్ కోర్సు, హ్యాండ్ ఎంబ్రైడింగ్, పుట్టగొడుగుల పెంపకం, వెదురుతో వస్తువుల తయారీ కోర్సులలో 30 రోజుల నుంచి 60 రోజుల కాలవ్యవధితో ఉచిత శిక్షణనివ్వనున్నట్లు రంపచోడవరం పిఒ సూరజ్ గనోరే విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల యువత వెలుగు ఎపిడికి ఈ నెల 4న, శనివారంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణకాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు

ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని అరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం లెప్రసీ వ్యాధిపై గిరిజనులకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శ లేని తెల్లటి మచ్చలు ఏర్పడటం, చేతుల నుండి వస్తువులు జారి పోవడం, కాళ్ల నుంచి చెప్పులు జారి పోవడం వంటి లక్షణాలతో పాటు పలు వ్యాధి లక్షణాలపై కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కుమార్ రత్న అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ సర్పంచ్ జి.శారద, కార్యదర్శి జీవన్ బాబు, హెల్త్ సూపర్వైజర్ జానకి, సిబ్బంది గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రవాణా శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-పాడేరు:జాతీయ భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం పాడేరు జీప్ స్టాండ్ వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్ల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో సుమారు 60 మంది వాహన డ్రైవర్లు పాల్గొని కంటి చికిత్సలు, ఇతర చికిత్సలు పొందారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖాధికారి లీలా ప్రసాద్ మాట్లాడుతూ, డ్రైవర్లు ఆరోగ్య విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా దృష్టి లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకొని తగు చికిత్సలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటారు వాహన ఇన్స్పెక్టర్ వాసు, వైద్యులు శ్రీకాంత్, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ అవకతవకలపై ఫిర్యాదు చేయండి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు

ప్రజా పంపిణీ వ్యవస్థపై ఫిర్యాదులకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పాడేరు డివిజన్ సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిర్వహిస్తున్న బియ్యం పంపిణీ, ఇతర రేషన్ సరుకుల సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా, సక్రమంగా పంపిణీ జరగకపోయినా తెలియజేయవచ్చన్నారు. బియ్యం పక్క దారి పట్టినా, ఇతర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చునని, తగు సలహాలు సూచనలు ఇవ్వవచ్చని ఆమె తెలిపారు. ఫిర్యాదులకు ఫోన్ 94409 33450 నంబరుకు లేదా వాట్స్ యాప్ సందేశం ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదుదారులు పూర్తి వివరాలు, ఫోన్ నంబరు తెలియజేయాలని ఆమె సూచించారు.

టెస్టు మ్యాచ్‌కు అంతా సిద్ధం

ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-పిఎం.పాలెం : భారత్ -ఇంగ్లాండ్ రెండో టెస్టు మ్యాచ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ- విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న టెస్టు మ్యాచ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 15 వేలు, ఆఫ్‌లైన్‌లో 5 వేల వరకు టికెట్లు విక్రయించినట్లు వెల్లడించారు.

విద్యార్థులు, క్లబ్ క్రీడాకారులకు ఉచితం

ఈ మ్యాచ్‌కు రోజుకు 2 వేల మంది చొప్పున 5 రోజులకు 10,000 మంది విద్యార్థులకు ఉచితంగా మ్యాచ్ చూసే అవకాశం కల్పిస్తామన్నారు. విద్యార్థులు యూనిఫాం, ఐడి కార్డులతో రావాలని చెప్పారు. విద్యార్థులను గేట్ నంబర్ 14 నుంచి 'కె' స్టాండ్‌లోకి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు టీచర్లు లేదా ఇన్‌ఛార్జిలు వస్తే వారు తమ ఐడీ కార్డులను చూపిస్తే స్టేడియంలోకి అనుమతిస్తారన్నారు. రోజుకు 2,850 మంది చొప్పున క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు 5 రోజులకు కలిపి 14,250 మందికి ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు.

స్కూలు బ్యాగులు, ల్యాప్‌టాప్, అగ్గిపెట్టెలు, బైనాక్యులర్స్, బ్యాటరీలు, సిగరెట్లు, లైటర్లు, హెల్మెట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని తెలిపారు.

మ్యాచ్ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది. ప్రేక్షకులను ఉదయం 8 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు. స్టేడియంలోకి వచ్చిన తర్వాత ఒకసారి మాత్రమే బయటకు వెళ్లి తిరిగి రావడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఇనసైడర్ ఇన్ వెబ్‌సైట్‌లోనూ, పేటీఎం యాప్‌లో టికెట్లు లభిస్తాయని తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో, ఫిబ్రవరి 15 తేదీ వరకు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లను కొనుగోలు చేయొచ్చని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టికెట్లు విక్రయించేలా ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు.

ప్రేక్షకులకు తాగునీరు ఉచితంగా

అందిస్తామని, కొనుగోలు చేసేందుకు ఫ్యాకింగ్ వాటర్ బాటిళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. స్టేడియంలో రకరకాల ఫుడ్‌స్టాల్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్టేడియంలోనికి బయటి నుంచి నీళ్ల బాటిళ్లతో సహా ఎలాంటి తినుబండారాలను ప్రేక్షకులు తమ వెంట తీసుకురావద్దని చెప్పారు. కెమెరాలు, బ్యానర్లు, జెండా కర్రలు,

ప్రాక్టీసుతో క్రికెటర్ల సందడి

పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ- విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం బుధవారం భారత్, ఇంగ్లాండ్ ఆటగాళ్లతో సందడి నెలకొంది. ఎసిఎ-విడిసిఎ 'బి' గ్రౌండ్‌లో టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ, సిరాజ్, శుభ్‌మన్, కెఎస్ భరత్ తదితర ఆటగాళ్లు ప్రాక్టీసు చేశారు. ఇంగ్లాండ్ క్రికెటర్లు కూడా ప్రాక్టీసు చేశారు.

ప్రాక్టీసు చేస్తున్న భారత ఆటగాళ్లు

'ఆడుదాం ఆంధ్రా'లో రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలవండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పోటీల ప్రారంభంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు:ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలలో రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్. సుమిత్ కుమార్ ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను జిల్లా కలెక్టర్ స్థానిక శాసనసభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల రోజులుగా గ్రామ స్థాయి నుండి, మండల, నియోజకవర్గ స్థాయి వరకు పోటీలు ఘనంగా జరిగాయని తెలిపారు. అందరూ ఎంతో కష్టపడి పని చేసారని పేర్కొన్నారు. గెలుపు, ఓటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా మరింత ఉత్సాహంతో చైతన్యవంతులు కావాలని సూచించారు. జిల్లా స్థాయిలో గెలుపొందినవారు మరింత కృషి చేసి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని కలెక్టర్ కోరారు.

స్థానిక పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ఆడుదాం-ఆంధ్ర అందరి ఆట అని, ఇందులో ప్రజలందరూ భాగస్వామ్యం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలోనే మొదటి సారిగా ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టడం గర్వకారణమన్నారు. క్రీడాకారులు తనలో దాగి ఉన్న క్రీడాస్ఫూర్తిని బయటకు తీసి సత్తా నిరూపించుకోవాలని ఎంఎల్ఎ సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందడమే కాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనం చేసిన కలెక్టర్, ఎంఎల్ఎలు జిల్లా స్థాయి క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్డిఓ శాంతలక్ష్మి, జిల్లా క్రీడా అధికారి జగన్మోహన రావు, ఎంపిడిఓ నవీన్, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రాజు, పిపి రత్నకుమారి, వైస్ ఎంపిపి కనకాలమ్మ, సర్పంచులు ఎస్ రాంబాబు, వి.రాంబాబు, జి.నీలకంటం, ఎఎంసి చైర్మన్ సూరిబాబు, ఎంపిటిసిలు ఎల్.రామకృష్ణ పాత్రుడు, సన్యాసిరావు, ఆహార సలహా మండలి చైర్మన్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కురిడి జంక్షన్‌లోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బుధవారం బైకుపై భార్యాభర్తలు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధిత గిరిజనులు కిల్లో సన్యాసిరావు, చిలకమ్మ చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ టేకులవీది గ్రామానికి చెందిన వారు. ఒడిశా రాష్ట్రం కింజూరు గ్రామంలో బంధువుల వివాహ వేడుకలో పాల్గొని తిరుగు ప్రయాణంలో కురిడిలో బైకు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. గాయాలతో ఉన్న వీరిని స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రులను అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ నేతల ప్రచారం

ప్రజాశక్తి-అరకు లోయ :మండలంలోని గన్నెల, లోతేరు పంచాయితీల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ శెట్టి గంగాధర స్వామి బుధవారం ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని 108, 104 వంటి వాటిని ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే అన్ని వర్గాల ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ వంటి పథకాలు పెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని ఆయన అన్నారు. మళ్ళీ ఆంధ్ర రాష్ట్రంలో షర్మిలమ్మ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హెూదా సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబూరావు, శెట్టి అద్దు, శెట్టి కిరణ్, భైరగి నాయుడు, పటాసి రామన్న, బాకా అప్పారావు, బాకా రామారావు, ఆడారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తులు అందిస్తున్న టిడిపి నేతలు

గ్రామాల్లో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-పాడేరు: మండలలోని ఒనుగుపల్లి పంచాయతీ తామరపల్లి , బంగారమెట్ట , బిర్మిశాల గుర్రగరువు గ్రామాల్లో బుధవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై టిడిపి నేతలు ప్రచారం నిర్వహించారు రాబోయే ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి నమ్మకం పెరుగుతుందని విశాఖ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొత్తగుల్లి సుబ్బారావు తెలిపారు. అనంతరం గిరిజనులు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోమాజీ ప్రెసిడెంట్ వర్తన పిన్ని దొర, మాజీ ప్రెసిడెంట్ బాకూరు బాలరాజు, టిఎన్ఎస్ఎఫ్ లీడర్ వినోద్, నందమూరి ఎన్టీఆర్ సంఘం నాయకులు పూసర్ల గోపి, వనుగుపల్లి వైస్ సర్పంచ్ వాకూరు చిన్న రాజు, గ్రామ పెద్దలు నైని చిన్నమనాయుడు, తెలుగు యువత ప్రసాద్, సాగర్, జగదీష్, తెలుగు మహిళలు వణుకు పల్లి పంచాయతీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి - విఆర్.పురం: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిహెచ్ఓ ఎం.సురేష్ సూచించారు. మండలంలోని చిన్నమట్టపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సోడే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన, రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభావిత ప్రాంతాల్లో 0- 40 ఏళ్ళ మధ్య వయసున్న 7 కోట్ల మందికి సికెల్‌సెల్ ఎనీమియాపై అవగాహన, రక్తనిర్ధారణ పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈవ్యాధి వారసత్వంగా సంక్రమించే అవకాశాలున్నాయని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉండడం వల్ల ఇది వస్తుందన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న వారిలో ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్ళపసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరుచుగా వచ్చే అంటువ్యాధులు, మహిళలకుగర్భధారణ సమయంలో సమస్యలు వంటి లక్షణాలతో బాధపడుతుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.విజయకుమారి, ఆశావర్కర్ సోడే రాములమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లింపునకు ఇక్కట్లు

ప్రజాశక్తి -సీలేరు: విద్యుత్ బిల్లులు కట్టించుకునే బిల్లు కలెక్టర్ సక్రమంగా రాకపోవడంతో విద్యుత్ బకాయిలు పెరిగిపోతున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధిలో కేటగిరి 1,2 కిందున్న వినియోగదారులు ఇప్పటివరకు ప్రతినెలా వచ్చే బిల్లు కలెక్టర్‌కు విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. అయితే కొన్నాళ్లుగా బిల్లు కలెక్టర్ రాకపోవడంతో ఎవరికి బిల్లులు చెల్లించాలో అవగాహనలేని కొందరు వినియోగదారులు నెలసరి బిల్లు చెల్లించలేకపోతున్నారు. దీంతో బిల్లు బకాయిలు పేరుకుపోతున్నాయని, ఎపుడు విద్యుత్ సిబ్బంది వచ్చి పీక మీద కూర్చుని పెద్దమొత్తంలో బిల్లును చెల్లించమంటారోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఆన్‌లైన్ బిల్లులు చెల్లింపుల్లో కాస్తా అవగాహన ఉన్నవారు మొబైల్‌లోనూ, నెట్ సెంటరుకు వెళ్లి విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నారు. అయితే అనేకమంది విద్యుత్ బిల్లులు మాత్రం చెల్లించకపోవడంతో సీలేరు పంచాయతీ పరిధిలోనే దాదాపు రూ.ఐదు లక్షల వరకు బిల్లు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని సమాచారం. దారకొండ పంచాయతీలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ యంత్రాంగందీనిపై స్పందించి, రెగ్యులర్‌గా బిల్లుకలెక్టర్‌ను పంపి వినియోగదారుల నుంచి మునపటిలా విద్యుత్ బిల్లులు కట్టించుకోవడం చేయాలని అంటున్నారు. అలాకానీ పక్షంలో విద్యుత్ బిల్లు వచ్చిన వెంటనే దాన్ని ఎలా చెల్లించాలో వినియోగదారులకు అవగాహన కల్పించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన పూలే, అంబేద్కర్, సేవారత్న జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అకాడమీ రాష్ట్ర మహిళా కార్యదర్శి డిపి మార్గరేట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, గాయకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హులైన వారు 98481 63912, 94938 86967 నెంబర్లను సంప్రదించాలని కోరారు. నింపిన దరఖాస్తును జెఆర్.నగర్, శ్రీకృష్ణ అపార్ట్‌మెంట్, విశాఖపట్నం అడ్రస్‌కు పంపించాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 11న తిరుపతిలో జరిగే జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేస్తామని వెల్లడించారు.

స్థానికేతర నాయకత్వమా ?

ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల సీట్లపై అంతటా ఇదే చర్చ
గుర్రుగా ఉన్న విశాఖ లోకల్ లీడర్స్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని పలు జిల్లాలతో పోలిస్తే విశాఖపట్నానికి చాలా అంశాల్లో కొన్ని ప్రత్యేకతలున్నాయి. రాజకీయ నాయకత్వంలోనూ ఇదే ప్రస్ఫుటమవుతోంది. స్థానిక రాజకీయాల్లో స్థానికేతరుల పెత్తనం ఇక్కడ సాగుతూ వస్తోంది. ఈ కారణంగా కొన్ని దశాబ్దాలుగా వివిధ తరగతులకు చెందిన ప్రధాన పార్టీల స్థానిక నేతలు వారిని అనుసరించే వారిగా మారిపోయారు మినహా స్థానికుడు ఇంతవరకూ పార్లమెంట్ సభ్యునిగా విశాఖపట్నం నుంచి ఎన్నికయ్యింది లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. విశాఖపట్నంకుగల ప్రత్యేకత ఇక్కడ ప్రభుత్వ రంగ పరిశ్రమలే. వీటిలో స్టీల్‌ప్లాంట్, వైజాగ్ పోర్టు ముఖ్యమైనవి. ఈ రెండూ భారీ వ్యాపార కేంద్రాలనే చెప్పొచ్చు. ఉక్కు ఉత్పత్తితో అనేక మంది బయట నుంచి వచ్చిన వ్యక్తులు స్టీల్ ఉత్పత్తుల ట్రేడర్లుగా ఈ కాలంలో అభివృద్ధి చెందడం ఒకటైతే, వైజాగ్ పోర్టు సరుకు రవాణా ఎగుమతి, దిగుమతుల్లో ఇక్కడకు వచ్చిన కొద్దిమంది వ్యాపారుల జోక్యం పెరిగి కుబేరులై వీరే రాజకీయాలను నియంత్రించగలగడం మరో అంశం. ఈ రెండూ ఇక్కడ గమనించదగ్గ విషయాలే. వ్యాపారాల ద్వారా చేజిక్కించుకున్న సొమ్మును రాజకీయాల్లో పెట్టుబడి పెట్టి విశాఖ రాజకీయాలను వీరంతా శాసిస్తూ వస్తున్నారు. ఇసుక, మద్యం, మైనింగ్ ఇలా పలు వ్యాపారాలను వీరు సొంతం చేసుకోవడంతో వీరి వెనక స్థానిక నాయకులు కొంతమంది చేరి ఆర్థిక ప్రయోజనం ఎంతోకొంత మేర పొందగలిగారు. క్రమంగా బయట నుంచి వచ్చిన వారి పెత్తనం స్థానిక రాజకీయాలపై పెరిగిపోవడంతో స్థానికుల్లోనూ ఆవేదన రగులుకొంటోంది. ఈ నేపథ్యంలోనే విశాఖపట్నం పార్లమెంట్ మెంబరుగా 2024 ఎన్నికల్లో వైసిపి నుంచి అధికార పార్టీ తరపున బొత్స ఝాన్సీలక్ష్మి పేరును దాదాపు అధిష్టానం ఖరారు చేసింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి అయిన ఝాన్సీ గతంలో విజయనగరం ఎంపీగాను, జెడ్‌పి ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశారు. గాజువాక ప్రాంతం వీరి కుటుంబీకులదన్న కారణంతో తాజా రాజకీయాల్లో ఆమెను విశాఖ ఎంపీగా బరిలోకి దించారు. ఇక్కడి సిట్టింగ్ ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు తూర్పు అసెంబ్లీని వైసిపి కేటాయించింది. ఇక్కడ ఇదివరకటి నుంచే స్థానికేతరుడైన వెలగపూడి రామకృష్ణబాబు టిడిపి నుంచి మూడు దఫాలుగా గెలుపొందిన నాన్‌లోకల్ 'సిట్టింగ్'గా ఉన్నారు.

స్థానికేతర రాజకీయాలకు ఆద్యులు వారేనా?

1980వ దశకంలో స్థానికేతర నాయకత్వం ఇక్కడ తిష్టవేసి రాజకీయ పదవులకు ఎగబడడం తెలిసిందే. ప్రస్తుతం విశాఖలోని ప్రధాన రాజకీయ పార్టీల్లోగల స్థానిక రాజకీయాల్లో స్థానికేతర నాయకత్వంపై పలువురు స్థానికులు గుర్రుగా ఉన్నారన్నది వాస్తవం. తొలినాళ్లలో విశాఖపట్నం ఎంపీ స్థానానికి పోటీచేసి గెలుపొందిన వారిలో టి.సుబ్బరామిరెడ్డి, ఎంవివిఎస్.మూర్తి ఉన్నారు. ఆ తర్వాత వరుసలో కంభంపాటి హరిబాబు, దగ్గుబాటి పురంధరేశ్వరి, తాజాగా ఎంవివి.సత్యనారాయణ ఉన్నారు. వీరంతా స్థానికేతరులే. ఏళ్లతరబడి విశాఖతో వీరికిగల అనుబంధం రీత్యా ప్రజల్లో ఏదో ఒక స్థాయిలో ఏదో ఒక విధమైన అంగీకారంతో వీరు పార్లమెంట్ సభ్యులుగా గెలుపొంది రాజకీయాలు చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. పార్లమెంట్ స్థానాలేగాకుండా భీమిలి, ఉత్తరం అసెంబ్లీ సెగ్మెంట్లలో గెలుపొందిన మాజీ మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు సైతం స్థానికేతరులే. ప్రస్తుతం విశాఖతో ఎలాంటి సంబంధమూ లేకపోయినా రాజ్యసభ సభ్యుడినంటూ బిజెపి నాయకుడు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావు విశాఖపై ఆధిపత్యానికి చేయలేని ప్రయత్నం అంటూ ఏదీ లేదు.

రిపబ్లిక్ డేను సైతం తన సొంత రాజకీయ అజెండా కోసం వాడుకుని సంబరాలు జరిపిన వ్యక్తిగా విశాఖ ప్రజల్లో జివిఎల్ నిలుస్తారు. విశాఖ ఎంపీగా 2024లో బిజెపి నుంచి తానే పోటీచేస్తానంటూ ఆయన ప్రచారం సాగిస్తున్నారు. స్థానిక రాజకీయాలపై 2024 నాటికి స్థానికేతరుల పెత్తనం మరీ పెరిగిపోవడంతో ఎక్కడికక్కడ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా టిడిపి, వైసిపి, జనసేన నేతల్లో ఆవేదన పెరిగి తమకే సీట్లు కేటాయించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఆయా పార్టీల అధిష్టానాలు ఎలా స్పందిస్తాయో చూడాల్సిందే.

మిలాన్‌కు తీరాన్ని సిద్ధం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో మిలాన్-2024 నిర్వహిస్తున్న సందర్భంగా తీర ప్రాంతాన్ని సుందరీకరించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మిలాన్ 2024 కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి 27 వరకూ ఆర్‌కె.బీచ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా జరుగనున్నందున ఆ ప్రాంతాన్ని నేవల్ అధికారులు కెప్టెన్ దివాకర్, నేవల్ కోస్టల్ బ్యాటరీ ఆఫీసర్ ఇన్‌ఛార్జి మనోజ్ కుమార్‌లతో కలిసి పరిశీలించడంతోపాటు మిలాన్ కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దాదాపు 50 దేశాలు మిలాన్ కార్యక్రమాల్లో పాల్గొననున్నందున వారికి నగర సుందరీకరణతో ఆహ్లాదం కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌కె.బీచ్ రోడ్డులో అవసరమైన చోట్ల రోడ్లు మరమ్మతులు, గోడలకు పెయింటింగ్ పనులు చేపట్టాలని, ఎలక్ట్రికల్ స్తంభాలకు తుప్పును తొలగించి ఆకర్షణీయమైన పెయింటింగ్ వేయించాలని అన్నారు. పనిచేయని సిసి కెమెరాల మరమ్మతులు చేపట్టాలన్నారు. తన పర్యటనలో భాగంగా కమిషనర్ గ్రీన్ పార్క్ నుంచి సెవెన్ హిల్స్ ఆసుపత్రి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి 15 రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ రాజు, కెవిఎన్.రవి, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు సంతోషి, రత్నాకర్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వినయ్ కుమార్, ఎఎంఒహెచ్ డాక్టర్ రాజేష్, డిఇలు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

యువతతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉపాధి

ప్రజాశక్తి-విఆర్.పురం: గిరిజన నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఇన్‌ఛార్జి ఎస్ఐ వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రేరణలో భాగంగా.బుధవారం రేఖపల్లి సెంటర్‌లో ఉచిత ఉపాధి శిక్షణపై విస్తృతం ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, అల్లూరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రేరణలో భాగంగా ప్రశాంతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో నిరుద్యోగ గిరిజన మహిళలకు టాటా టెక్నాలజీ సంస్థలో ఉపాధితో కూడిన ఉచిత శిక్షణనిస్తున్నారని,.ఈ అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఆధునికీకరణకు చర్యలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల్లోని పౌరగ్రంథాలయాలను ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు ఐటిడిఎ పిఓ సూరజ్‌గనోనే స్పష్టం చేశారు. శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాలను పునర్నిర్మించి, వాటిలో అవసరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారా డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దుతామనిన్నారు. అలాగే ఐఎఫ్ఎల్ ప్యానెల్స్ ఏర్పాటు, ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్ సదుపాయం కల్పన ద్వారా గ్రంథాలయాల సేవలను వినియోగదారులకు అందుబాటులో తీసుకొస్తున్నామని, విద్యార్థులు, నిరుద్యోగ యువత వీటిని సందర్శించి, సద్వినియోగంచేసుకోవాలని పిఓ ప్రకటనలో సూచించారు.

ఆరోగ్య అవగాహన సదస్సు

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మాసిదోనియా చర్చిలో ఫాస్టర్ శామ్యూల్ అధ్వర్యంలో బుధవారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు.పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శిరీషరాణి పాల్గొని, గిరిజనులకు ఆరోగ్యసూచనలు చేశారు. పిహెచ్‌సి కంటి వైద్యనిపుణుడు శ్యామ్ పాల్గొని, కంటి పరీక్షలు చేయడంతోపాటు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కిచెన్ గార్డెన్ విత్తనాలను పంచిపెట్టారు. అలాగే మాసిదోనియా చర్చి ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా వాషింగ్ పౌడర్, నీలిమందు, రూమ్ ఫ్రెష్‌నర్స్, ఫినాయిల్ తదితర కెమికల్స్, సుగర్ మందు, లిప్ బామ్, పెయిన్ బామ్, హెయిర్ ఆయిల్ తదితర హెర్బల్ సామగ్రి తయారీపై తర్ఫీదునిచ్చారు.కార్యక్రమంలో చర్చి ఫాస్టర్స్, సేవాభారత్ జిల్లా కో ఆర్డినేటర్ నానాజీ, రంప చోడవరం, గంగవరం, చిన బారంగి, దేవరపల్లి, సున్నంపాడు, మారేడుమిల్లి నుంచి గిరిజనులు పాల్గొన్నారు.

జిసిసిలో 21 మందికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గిరిజన సహకార సంస్థ (జిసిసి)లో 21 మందికి ఉద్యోగోన్నతులు కల్పించారు. బుధవారం సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగోన్నతులు పొందిన ఉద్యోగులకు ఉత్తర్వులను జిసిసి చైర్ పర్సన్ శోభా స్వాతి రాణి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిసిసి నందు 20 నుండి 30 సంవత్సరాల పైబడి రాష్ట్రవ్యాప్తంగా మారుమూల గిరిజన ప్రాంతాలలో ఆఫీస్ సబార్డినేట్ క్యాడర్‌లో పనిచేస్తున్న 21 మందికి సేల్స్ మెన్‌లుగా ఉద్యోగోన్నతులు కల్పించామన్నారు.

ఉద్యోగోన్నతులు పొందిన వారిలో 17 మంది షెడ్యూల్డ్ తరగతులకు చెందిన వారు ఉన్నారన్నారు. ఉద్యోగోన్నతి పొందిన వారంతా స్వాతి రాణికి, జిసిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (పరిపాలన) జె.యూస్టస్, డివిజనల్ మేనేజర్, రంపచోడవరం జి.పార్వతీశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.